స్కెచ్

# గాజుకూజాలో ప్రేమరోజాలు

ఈరంకి వెంకటరావు

శర్మ సరోజను ప్రేమించాడు. ప్రేమ గుడ్డిదన్నారు పెద్దలు. ఐతే అక్కడితో ప్రేమ నిర్వచనంగాని, అంతరార్థంగాని పూర్తయిందనడానికి వీలులేదు. ప్రేమయొక్క లోతుపాతులు తెలుసుకోవడానికి యీ నాటివరకూ ఏ విధంగానైతే కృషి జరుగుతోందో, అదేవిధంగా ప్రేమ యీ నాటికిగూడా సరిగా నిర్వచించబడలేదు. పెద్దలుమాత్రం ప్రేమ పరిపూర్ణమయిందన్నారు. ఈర్ష్య నశించినచోట ప్రేమ ఉద్భవిస్తుందన్నారు.

ప్రేమగురించి అనేకవిధమైన రచనలు బయలుదేరాయి. ప్రేమ కామానికీ, మోహానికీ అతీతమైనదనీ, ప్రేమ ఆధ్యాత్మికమైనదనీ, చెప్పటానికే చాలా గ్రంథాలు రచించబడ్డాయి. నవలాకారులు, కవులు, నాటకరచయితలు, రోమియో జూలియెట్లను, లైలామజ్నూలను, షిరిన్ ఫరాద్‌లను సోనీ మహీవాల్‌లను ప్రేమ సామ్రాట్టులనుగా చిత్రిస్తూ చిరస్మరణీయంచేసేశారు. ప్రేమ అనేది లేకపోతే యీనాటి ప్రపంచసారస్వతం ఇప్పుడున్నదాంట్లోపదోవంతువుండివుండేదేమో.

నిజంగా ప్రేమ అనేది దైవికమైనదేమో! పురాణ గ్రంథకర్తలూ, వేదాంతసార గ్రంథకర్తలూ దైవాన్ని నిర్వచించేటప్పుడు "నేతి, నేతి" అంటారు—ఇది కాదు, అది కాదు అని మాత్రమే చూపించగల్గారు దైవాన్ని.

ప్రేమగూడా ఆవిధంగానే నిర్వచించబడాలేమో కాళిదాసు ప్రేమను రెండువిధాలుగా విభజించాడు—ఒకటి ప్రతిఫలం కోరేది, మరియొకటి ప్రతిఫలం కోరనిది. బుద్ధభగవానుడు తన వేదాన్నంతా ప్రేమమీదే సృజించాడు. పతంజలి మహర్షి ప్రేమ ఉద్భవించటానికి అనేక మార్గాలు చూపించాడు. జీవాత్మ పరమాత్మలో ఐక్యమవడానికి ప్రేమ ముఖ్యమన్నాడు. అయితే అందరూగూడా ప్రేమ దేవునివలెనే విశ్వవ్యాప్తమయినా అనిర్వచనీయమని అంగీకరించాము.

ఈ రెండూ తెలుసుకోవడానికీ, నిర్వచించడానికీ యింతకంటె మార్గంలేక పోబట్టి ఎవరో బుద్ధిమంతుడు బయలుదేరి "దైవ ప్రేమ" అన్నాడు.

అయితే కవులను, వేదాంతులను దాటిపోయిన విశేష మొకటుంది. అది ఏదంటే దైవమూ, ప్రేమ రెండూ మూగవే బహుశా యీ విషయాన్ని స్పష్టీకరించడానికే శర్మ సరోజను ప్రేమించి వుంటాడు.

శర్మ ప్రేమను మనం తప్పుగా అర్థం చేసుకుందుకు వీలులేదు. అతని ప్రేమమాత్రం గుడ్డిది కాకపోయినా మూగది.

శర్మ, సరోజ ఒకే కాలేజీలో చదువుతున్నారు. సరోజను ప్రప్రథమంగా చూసినప్పుడే శర్మ సరోజను ప్రేమించక తప్పదనీ, సరోజ పురుష ప్రేమకు తగినదనీ అనుకున్నాడు. సరోజ ధనవంతురాలు, అందగత్తె, బుద్ధిమంతురాలు, పైగా చురుకైనది. ఇక కావలసిన దేముంది?

సాధారణంగా ప్రేమించిన వారిని నిర్వచించేటప్పుడు మాటలు కొరవడుతాయి— శర్మ విషయంలో సరిగ్గా యిదేజరిగింది. కాని అతను స్తబ్ధుడు కాదు. ఆమె గురించి అంతా ఆరా తీశాడు— ఆమె ఎక్కడ వుంటున్నదో తీరిక సమయాల్లో ఏం చేస్తుందో, ఆమెకు ఏదియిష్టమో ఏది అయిష్టమో అన్నీ. ఆమెనుగురించి విషయ సేకరణ పూర్తి అయాక ఎలాగో పరిచయం సంపాదించి రోజూ సాయంత్రం సమయాల్లో ఆమెను ఆమె యింటివద్ద కలుసుకుసేవాడు.

ఆమెతో ప్రపంచంలోని అన్నివిషయాల గురించి మాట్లాడేవాడుగాని, ప్రేమవిషయం మాత్రం ఎత్తేవాడుగాదు-ఎందువల్లనంటే ప్రేమ

మూగది. అతనికళ్ళే ఆమెకు సర్వమూ చెప్పేవి. అతని పెదవులుమాత్రం మెదలేవికాదు.

ప్రేమకూడా కొన్ని సంజ్ఞలతో నిండినదే. మన పూర్వులు భాషను అమలులోకి తీసుకురాని రోజులలో అన్నిపనులూ సంజ్ఞలద్వారానే నిర్వర్తించేవారు. ప్రేమకూడా చరిత్రాత్మకమైనదే గనుక అదే పద్ధతిని అనుసరణీయమైంది.

సరోజకు గులాబీలంటే చాలా యిష్టం. ప్రతిరోజూ సాయంత్రం శర్మ ఒకచక్కని గులాబీ చెండును తెచ్చిఇచ్చేవాడు. సరోజ సంతోషంతో స్వీకరించి దానిని తన కురులలో కూర్చుకునేది. ప్రేమకు ఇంతకంటే వేరుచిహ్నం ఏమికావాలి? శర్మ ఉప్పొంగిపోయేవాడు.

కాని ఒకరోజున అతను దెబ్బతిన్నట్టు అయాడు. నిర్మల ప్రేమప్రవాహం ఎప్పుడూ తిన్నగా వెళ్ళదు. తనవలెనే మరొక వ్యక్తికూడా సరోజను ప్రేమించటం గమనించాడు శర్మ. తనకు యింకొకవ్యక్తి పోటీవుండడం భరించలేకపోయాడు. ఒకరోజు సాయంత్రం సరోజ ఇంటికి వెళ్ళే మార్గంలో ఆవ్యక్తిని కలుసుకుని అడిగాడు.

"సరోజ ఇంటికి రోజూ సాయంత్రం నువ్వు రావడంలో నీ అభిప్రాయమేమిటి?"

"సరిగ్గా ఇదే ప్రశ్న నేనూ నిన్ను అడుగుదామనుకుంటున్నాను" అన్నాడు ప్రత్యర్థి.

"అది నాకలవాటు!" అన్నాడు శర్మ.

"అయితే నీ అలవాటు మార్చుకోవలసిన సమయం ఆసన్నమయింది!" అన్నాడు చల్లగా ప్రత్యర్థి శర్మతో.

"ఆ, అలాగా, ఈ రోజునుంచీ ప్రతి సాయంత్రం నీవే మరొకచోటికి వెళ్ళవలసి వుంటుంది." అన్నాడు శర్మ అతనికంటే మెల్లగా.

ప్రత్యర్థి నవ్వాడు "చూడు, సరోజకు ఒకరితో వివాహం నిచ్చయమైందని నీకు తెలుసునా?" అన్నాడు.

"అది అబద్ధం!" అరచాడు శర్మ. నేను నిన్న గులాబీనిస్తే ఆమె నవ్వుతూ స్వీకరించి తలలో ముడుచుకొంది." అన్నాడు శర్మ.

"అయితే అయివుండవచ్చు నేను చెప్పిన రహస్యం కొద్దిరోజుల్లో బయటపడుతుంది. నీవు ఈ రోజున ఆమెవద్దకు వెళ్ళినపుడు ఈ విషయం గురించి ఆమెనే ఎందుకు అడగకూడదూ?" అని ప్రత్యర్థి ఇంకా నవ్వుతున్నాడు.

"మా స్నేహం యొక్క పవిత్రతను ఈ విషయం అడిగి పాడుచెయ్యదలచుకోలేదు - అందులోనూ నీ సమక్షంలో"

"సరే, ఐతే నీమనశ్శాంతికోసం నేనీరోజున రాదలచుకోలేదు. కాని నీవు ఆమెను ప్రేమ గురించి అడగాలి సుమా" అని నవ్వుతూ అన్నాడు ప్రత్యర్థి. అతను పసరికలోపాకే పాములాగ కనిపించాడు శర్మకి. అతన్ని తొక్కి చంపివెయ్యటం సాధ్యంగా కనిపించలేదు. అతనింకా నవ్వుతూనే వున్నాడు. ఆ నవ్వు శర్మకు విషప్రాయంగా వుంది.

"సరోజ నిన్ను ప్రేమిస్తోందనుకుంటున్నావు!" అన్నాడు శర్మ ప్రత్యర్థితో. ప్రత్యర్థి చలించలేదు. "అనుకోవడంలేదు, నాకు తెలుసు!" అన్నాడు ప్రత్యర్థి.

ఈ జవాబు శర్మను నిరుత్తరునిగా చేసింది. అతనికి సరోజయింటికి వెళ్లేమార్గం తప్ప ఇంకేమీ కనుపించలేదు. అక్కడికి వెళ్ళాడు. అతని శక్తులన్నీ మేల్కొని అతనిని మూగవాడుగా చేసేలోగానే సరోజను అడిగాడు.

"నీ వివాహం నిశ్చయమైందా?"

"అవును! నా కాబోయే భర్తతో కొద్దిరోజుల క్రిందటే మీకు పరిచయం చేశానుగా" సరోజ సమాధానమది.

"కాని... కాని, నీవు నా గులాబీలను తీసుకుంటున్నావు... నీవు నన్ను ప్రేమించావనుకుంటున్నాను!" తొట్రుపాటుతో అన్నాడు శర్మ.

"లేదు, లేదు. మీరు పొరబడ్డారు. నేను ప్రేమ గురించి మీ గులాబీలు తీసుకోలేదు. ఒక్కక్షణం ఆగండి!" అంటూ సరోజ చిన్న గాజుకూజాలో వున్న జామ్‌తో తిరిగి వచ్చింది.

"ఇవిగో మీ గులాబీలు! నేను వాటితో గుల్కంద్ చేశాను. ఈ కూజాతోసహా మీరు దీనిని తీసుకోవచ్చు!" అంటూ జవాబుకోసం చూడకుండా జామ్‌కూజాను ఉక్కిరిబిక్కిరవుతున్న శర్మచేతుల్లో పెట్టింది. ★